# జీవించడం తెలీని మనిషి!

సమాజం మనిషిని నిర్మిస్తుంది. సమాజమే నవ్యనీ నిర్మించింది. అయితే నవ్య ఒక ప్రశ్నలా కనిపిస్తోంది. ఆ సందర్భంగా మా నాన్నగారి మాటలు గుర్తు తెచ్చుకుంటున్నాను.

'మనిషి సృష్టిస్తాడు. సృష్టిస్తున్నాడు. ఎన్నెన్నో నేర్చుకుంటూ నేర్పుతున్నాడు. ఒకటి మాత్రం నేర్చుకోలేకపోతున్నాడు. జీవనకళ నేర్చుకోలేకపోతున్నాడు. జీవించడం తెలీని మనిషిగా జీవిస్తున్నాడు' - ఇవీ ఆయన మాటలు!

★ ★ ★

సామాజిక అభద్రతలో పలువిధాల సామాజిక మనస్తత్వాలు ఏర్పడుతాయి.

ప్రజలు భయపీడితులుగా జీవిస్తారు. డబ్బు మాత్రమే భద్రత ఇవ్వగలదని డబ్బుకోసం కొందరు జీవన విలువలను త్యాగం చేసేసి, అవినీతి పరులుగా, దోపిడీదారులుగా, దొంగలుగా, నేరస్తులుగా జీవిస్తారు. కొందరు వ్యసనపరులుగా జీవిస్తూ భయం నుంచి తాత్కాలిక ఉపశమనం పొందుతారు. జీవనవిలువలను పూర్తిగా త్యాగం చేయలేని వారూ - అక్రమ మార్గాల్లో ధనార్జన చేయలేనివారు - ఆ విధంగా చాలా ఎక్కువ మంది ప్రజలు నిస్సహాయులుగా జీవిస్తారు.

ఆ విధంగా - పలు విధాల సామాజిక మనస్తత్వాలు - మానవ జీవనాన్ని నడిపే సామాజిక జీవన తత్వాలు - ఏర్పడతాయి. అటువంటి జీవన తత్వాల ప్రభావం వల్ల ఏ జీవన శైలికి ఆకర్షితులై లొంగిపోతూ ఎక్కువ మంది ప్రజలు జీవిస్తారో, ఆ జీవన శైలిలోకి ప్రజా జీవనం కొట్టుకుపోతుంది. ప్రజలు దాన్ని అడ్డుకోకపోతే, అది జీవన విధ్వంసాన్ని సృష్టిస్తుంది!

నవ్య జీవితంలో అదే జరిగింది.

★ ★ ★

అటువంటి మాటలు మా నాన్నగారు ఎప్పటికప్పుడు మాకే కాకుండా తెలిసిన వారందరికీ చెబుతూ వుండేవారు. ఆయన మాటలు వినడానికి కూడా ఆయన చుట్టూ ఎప్పుడూ ఎందరో చేరుతూ వుండేవారు. ఆయన మాటలను ఇప్పుడు నేను గుర్తుకు తెచ్చుకుంటున్నాను! ఎందుకోసం?!

నేనూ, నవ్యా పది సంవత్సరాల నుంచి జీవితాన్ని కలసి పంచుకుంటున్నాం. మా కుటుంబంలోకి వచ్చాక నవ్య మొదట్లో - మా అమ్మను అడిగి అన్నీ మా అమ్మ చెప్పినట్లే చేస్తూ వస్తోంది.

ఒకరోజున మమ్మల్ని పిలిచి మా నాన్నగారు చిన్న ఉపన్యాసం ఇచ్చేరు.

'మీ జీవితాన్ని మీకు కావలసినట్టు చేసుకోండి. మా అనుభవంలో మీకు ఏదైనా మంచి కనిపిస్తే, దాన్ని మీరు మీ అనుభవంలోకి మార్చుకోండి. అటుపైన ప్రతి విషయం మీ ఇద్దరూ కలిసి ఆలోచించుకుని చేసుకుంటూ వుండండి. మేమింక కుటుంబ విషయాలకు దూరంగా వుంటాం. స్వేచ్ఛగా మాకు నచ్చినట్టు మా శేష జీవితాన్ని గడపాలనుకుంటున్నాం. మనిషికి మూడు బాధ్యతలుంటాయి. మొదటి రెండు బాధ్యతలూ తనకీ, తన కుటుంబానికీ సంబంధించినవి. అవి మా శక్తి మేరకు మేం చేసేసాం. మూడో బాధ్యత తోటి మనుషులకూ - సమాజానికి సంబంధించింది. అందులో ప్రజలకూ - సమాజానికి - ప్రయోజనకరంగా విధినిర్వహణ ముఖ్యమైంది. అది కూడా మా శక్తి మేరకు పూర్తిచేసేసాం. అయినా - మిగిలిపోయింది చాలా వుంది. కష్టిస్తూ, శ్రమిస్తూ, దోపిడీకి గురవుతూ పేదరికంలో జీవిస్తున్న పేదవారి పిల్లలకు ఉచితంగా చదువు చెప్పాలనుకుంటున్నాం. వారికి పరిశుభ్ర జీవనం నేర్పాలనుకుంటున్నాం. మనం కూడా పేదవారమే. డబ్బు ఖర్చు పెట్టులేం. అయితే వాటిని మనం శ్రమించి చేయగలం. మీరొకటి అడుగుతారు. అది మాకు తెలుసు. ఆధ్యాత్మిక జ్ఞానంతో - భగవత్ జ్ఞానంతో - భగవత్ సేవలో - మీ శేష జీవితాన్ని ఎందుకు గడపకూడదు? అటువంటి ప్రశ్న అడుగుతారు. అది మాకు తెలుసు!

భగవత్ జ్ఞానం - భగవత్ సేవ - ఎందుకు? మనిషిని మానవ సేవలోకి మళ్ళించడానికి సహకరించేదిగా, సహకరించేందుకు - అటువంటి జ్ఞానం ఆవిర్భవించింది. అయితే ఆ జ్ఞానం దగ్గరే మనిషి ఆగిపోతున్నాడు! మానవ సేవలోకి వెళ్లకుండానే ఆయువు కోల్పోతున్నాడు! అదంతా వ్యర్థమైపోతోంది! ఆవిధంగా ఎంతో మానవ శక్తి, మానవ మేధస్సు వ్యర్థమైపోతోంది! గమ్యాన్ని చేరుకోలేకపోతోంది! ఎందరో ఎందరో దైవజ్ఞానాన్ని వారి వారి స్వార్థాలకు వాడుకుంటున్నారు! శ్రమ జీవనం - సత్య జీవనం - సర్వ సమాన సహజీవనం - మాత్రమే మంచి జీవితాన్ని నిర్మించగలవు! మంచి సమాజాన్ని నిర్మించగలవు!'

ఆ విధంగా మా నాన్నగారు చెప్పేరు. నేనూ, నవ్యా ఒప్పుకున్నాం. మా అమ్మా, నాన్నా వారు ఎంచుకున్న మార్గంలో జీవిస్తున్నారు.

కొద్దిరోజులు పోయాక, నవ్యకు ఉద్యోగం వచ్చింది. నేనేమీ చెప్పకుండా మౌనంగా వుండిపోయాను. మా అమ్మా, నాన్నా కూడా జోక్యం చేసుకోలేదు. వారు కూడా మౌనంగా వుండిపోయారు. ఆరోజు రాత్రి మేమందరం కలసి భోం చేస్తున్నాం. నవ్య ఆ విషయం కదుపుతూ తన అభిప్రాయాన్ని చెప్పేసింది. 'నేను ఉద్యోగంలో చేరితే అత్తగారూ, మామగారూ వారు ఎంచుకున్న మార్గంలో జీవించలేరు. అంతేకాకుండా, అత్తగారిని గౌరవనీయమైన పనిమనిషిగా మామగారిని అత్యంత గౌరవనీయమైన సేవకుడిగా చేయడమే అవుతుంది! వారిమీద మళ్ళీ భారం పెట్టడమే అవుతుంది!' అని చెప్పేసింది. ఉద్యోగాన్ని తిరస్కరించింది.

ఆమె నిర్ణయాన్ని మేమందరం గౌరవించేం.

★ ★ ★

కాలం గాలిలా వెళ్ళిపోతోంది.

ఒకరోజున మా నాన్నగారికి కొద్దిగా గుండె నొప్పి వచ్చింది. డాక్టర్లు వచ్చేరు. చూసారు. మందులిచ్చేరు. విశ్రాంతి అవసరమని చెప్పేరు. నిజానికి ఆయన ఎప్పుడూ విశ్రాంతిగా, ప్రశాంతంగా వుంటారు. ఆరోజు కూడా చిరునవ్వు నవ్వుతూ ఉత్సాహంగా, ప్రశాంతగా వున్నారు.

అదొక చిన్న గది. ఆ గదిలో మా అమ్మానాన్నా విశ్రాంతి తీసుకుంటారు. మాది చాలా చిన్న ఇల్లు. రెండు చిన్న గదులూ, చిన్న వంటగదీ, నడవ మాత్రమే ఉన్నాయి. ఆగదిలో ఒక పట్టె మంచం మాత్రమే పడుతుంది. దాన్ని మా నాన్నగారు వాడుకుంటున్నారు. మా అమ్మ తుంగచాప వేసుకుని విశ్రాంతి తీసుకుంటుంది.

పాత గోడలు పెల్లలు ఊడిపోతూ గాయపడిన మనిషి హృదయంలా కనబడుతున్నాయి. అయితే – మా బతుకు అలావున్నా, మా జీవితంలో సుఖం – సంతోషం – శాంతి మాత్రం వుంటోంది. సంతోషంగా ప్రేమగా జీవిస్తున్నాం. మా నాన్నగారి దగ్గర అందరం కూర్చున్నాం. ఆయన చిరునవ్వు నవ్వుతూ నెమ్మదిగా చెప్తున్నారు. ఆయాసం ఆయన మాటల్ని అడ్డుకుంటోంది.

'మనిషికి సుఖ జీవనం ఎంత గొప్పదో, సుఖ మరణం కూడా అంతే గొప్పది. నిజానికి అంతకంటే గొప్పది. అది ఆఖరి దశలో మాత్రమే గుర్తిస్తాం. ప్రతి మనిషి సుఖ మరణం కోరుకుంటాడు. తను బాధపడుతూ, పదిమందిని బాధపెడుతూ జీవించాలని ఎవరూ కోరుకోరు! సుఖజీవనం చాలా వరకూ మన చేతుల్లో వుంటుంది. సుఖమరణం అలా కాదు! అది ప్రకృతి నైజంగా మాత్రమే వస్తుంది! శరీరంలో ఏ లోపం ఎప్పుడు మనిషిని ఎలా కూలదోస్తుందో గుర్తించలేం! గుర్తించినా పూర్తిగా అదుపులో వుండదు!... ప్రకృతీ, మానవుడూ - మాత్రమే సత్యం! శ్రమ జీవనం - సత్యజీవనం - సర్వసమాన సహజీవనం మాత్రమే జీవన సత్యాలు. అవి మాత్రమే మనిషికి సుఖజీవనం ఇవ్వగలవు! మానవ సమాజంలో సర్వసమాన సహజీవన విలువలలో మాత్రమే - ప్రకృతిలో సర్వజీవజాలంతో మానవుని సమన్వయ సమతుల్య సహజీవన విలువలలో మాత్రమే - మానవునికి నిజమైన సుఖజీవనం దొరుకుతుంది. అప్పుడే శాంతియుత సమాజం వుంటుంది. మానవుడు అటువంటి విలువల కోసం పోరాడుతూ ధన్యుడు కావాలి! ప్రజా పోరాటాలు కావాలి! ప్రజా ఉద్యమాలు - ప్రజా యుద్ధాలు కావాలి! మహోన్నత విలువల కోసం అవి ధర్మ యుద్ధాలు!... అది మాత్రమే నిజమైన మానవ జ్ఞానం! తదితర జ్ఞానమంతా ఒట్టి భ్రమే!

మనిషి మరణాన్ని తుదిశ్వాస విడిచి పెట్టడంతో గుర్తిస్తాం. తుదిశ్వాస విడిచేక, మనిషిలోని సర్వజీవశక్తి నశించిపోతుంది. నిర్జీవ పదార్థం మాత్రమే మిగిలిపోతుంది. మనిషి మరణాన్ని నిర్ధారించే తుదిశ్వాస అనంతమైన వాయువులో కలిసిపోతుంది. దాన్ని ఆ తరువాత ఆ వ్యక్తి యొక్క శ్వాసగా గుర్తించుకోలేం!

అలాంటప్పుడు పునర్జన్మ ఏంటి? వట్టి భ్రమ! వాయువు తనంతట తాను జీవశక్తి కాదు. అది జీవి జీవించడానికి సహకరించే శక్తి మాత్రమే! ఒక నీటి బిందువును సముద్రంలోకి విసురుతాం! అది అనంత జలంలో కలసిపోతుంది! దాన్ని గుర్తుపట్టి తిరిగి తీసుకోగలమా?! తుదిశ్వాసలో కూడా అదే జరుగుతుంది!... మనిషి భ్రమలో జీవించకూడదు. జీవిగా జీవించాలి. మనిషిగా జీవించాలి. జీవితంలో జీవించాలి... మీరందరూ ప్రేమగా గౌరవంగా నా సుఖజీవనానికి సహకరించేరు. అది నాకు చాలు. నేను సుఖంగా మరణిస్తాను! నా మరణానంతరం, భ్రమలో - సంస్కారం పేరుతో - ఏ కర్మలూ చేయొద్దు! మనిషికి సేవ చేయాలి! బూడిదకు కాదు!... సామ్రాజ్యవాదం విస్తరింపచేస్తున్న

వస్తువ్యామోహం - మన సామాజిక జీవన విలువలను విధ్వంసం చేస్తోంది. అది మీ సుఖజీవనాన్ని విధ్వంసం చేస్తుంది! దాన్ని అడ్డుకోండి! సుఖంగా జీవించండి.'

అలా చెబుతూ చెబుతూ మా నాన్నగారు తుది శ్వాస విడిచిపెట్టేసారు!

మా ఇల్లు చీకటైపోయింది. మా గుండెలు విషాదంతో బరువెక్కి పోయాయి. విలపిస్తున్నాయి. కన్నీటిని కురుస్తున్నాయి. జనం గుంపులు గుంపులుగా వచ్చేరు. 'జీవించడం తెలిసిన మనిషి! మనిషికి తెలీనిదీ - మానవ జ్ఞానానికి అతీతమైన దైవజ్ఞానం - ఏదోవుందనే భ్రమలో జీవితాన్ని వ్యర్థం చేసుకోలేదు! మనిషిలోని జీవశక్తికి మరణం లేదనే భ్రమలో కూడా జీవితాన్ని వ్యర్థం చేసుకోలేదు! శ్రమ జీవనం - సత్యజీవనం - సర్వసమాన సహజీవనం - వాటి విలువల్లో మనిషిగా జీవిస్తూ చిరునవ్వు నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు' అలా అలా చెప్పుకుంటూ జనం నివాళి అర్పించారు.

నవ్య ఆ విషాదాన్ని తట్టుకోలేకపోయింది. స్పృహ తప్పి పడిపోయింది!

'అదృష్టవంతులు! హాయిగా వెళ్ళిపోయారు! భార్యాపిల్లలే కాకుండా కోడలు కూడా ఆయన్ని సొంత తండ్రి కంటే ఎక్కువగా చూసుకున్నారు! ప్రేమించారు! గౌరవించారు! నవ్య విషాదాన్ని తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయింది!' అలా అని కొందరు చెప్పుకున్నారు.

ఆయన సుఖంగా మరణించారు! హాయిగా వెళ్ళిపోయారు!

★ ★ ★

కాలం కర్కశమైంది. కాలసర్పం క్రూరమైంది. కాలం స్వార్థపరుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. మానవ విద్రోహుల చేతుల్లోకి వెళ్ళిపోయింది. మానవ జీవితాన్ని కూల్చేస్తోంది. సామ్రాజ్యవాదం విస్తరింపచేస్తున్న వస్తువ్యామోహం మానవ జీవితాన్ని కబళిస్తోంది. శాంతియుత జీవనాన్ని విధ్వంసం చేస్తోంది.

మా అమ్మ కాలానికి లొంగిపోలేదు. మా నాన్నగారు మరణించిన కొద్ది రోజుల్లోనే విషాదం నుంచి బయటపడిపోయింది. విషాదంలో జీవితాన్ని వ్యర్థం చేసుకోకూడదని నిశ్చయించుకుంది. సేవా జీవితాన్ని అంకితభావంతో గడుపుతోంది.

కాలం ఎవరి కోసం ఆగిపోదు. మా అమ్మకు గుండెనొప్పి వచ్చింది.

వైద్యులు విశ్రాంతి తీసుకోమన్నారు. మా అమ్మ ప్రశాంతంగా విశ్రాంతి తీసుకుంటోంది.

ఇప్పుడు మా ఇల్లు నిజానికి ఇల్లు కాదు! పెద్దభవనం! ప్రదర్శనశాల! తండ్రి ఇచ్చిన ఆస్తితో నవ్య మా జీవితాన్ని ప్రదర్శనశాలగా మార్చేస్తోంది!

ప్రచార ప్రసార మాధ్యమాలు వినిపించే ఏ వస్తువూ కూడా మా ఇంట్లో వుండకుండా వుండదు!

నవ్య ఒక వస్తువే అయిపోయినట్టు వస్తువ్యామోహంలో – వస్తు ప్రపంచంలో – జీవిస్తోంది. తన తల్లి కంటే ఎక్కువ ప్రేమతో చూసుకునే మా అమ్మ పట్ల నవ్యకు ప్రేమ తగ్గిపోతూ వస్తోంది!

పిల్లల పట్ల కూడా అసహజమైన ప్రేమ చూపిస్తూ వస్తోంది! మా పెంపుడు కుక్క మరణించి నప్పుడు కృతజ్ఞతగా ఒక్క కన్నీటి బొట్టు కూడా రాల్చలేదు! కంటతడిలేనే లేదు! కలిసి చదువుకోవడమే కాకుండా, మా ఇంటి పక్కనే వుంటున్న ఆమె స్నేహితురాలు మరణించినప్పుడు, కంటతడిలేని బొమ్మలా వుండిపోయింది!

ఆ మాటే ఆమెతో అన్నాను. పకపక నవ్వేసింది. మీకు మతిపోయినట్టుందని విరగబడి నవ్వేసింది.

గాయపడిన గుండెల్లాంటి గోడల మధ్య బతికిన మీకు నవ్య జీవనం వొంట పట్టడం లేదని విరగబడి విరగబడి విరజాజుల్లా నవ్వేసింది! విరజాజుల్ని నొల్లుకోడం తప్ప మరింకేమీ నేను చేయలేకపోయాను!

తన పనులన్నీ తానే చేసుకుంటూ మా అమ్మ మంచం మీద పది రోజులు విశ్రాంతి తీసుకుంది. ఆ మర్నాడు చిరునవ్వులు కురిపిస్తూ తుదిశ్వాస విడిచిపెట్టేసింది.

మా ఇల్లు చీకటైపోయింది. మా అమ్మ చిరునవ్వుల వెన్నెల మాకు లేకుండా పోయింది. మేమందరం విషాదంలో విషాదంగా విలపిస్తున్నాం. మా హృదయాలు కురిసిన కన్నీటి ప్రవాహంలో మా అమ్మ తేలిపోతూ ఎక్కడికో వెళ్ళిపోతున్నట్టు కనబడుతోంది.

జనం గుంపులు గుంపులుగా చేరిపోయారు.

'అదృష్టవంతురాలు! జీవించడం తెలిసిన మనిషి! హాయిగా వెళ్ళిపోయింది!' అని అందరూ నివాళి చెప్పారు. అలా చెప్పుకుంటూ అందరూ నవ్య మొహంలోకి ఆశ్చర్యకరంగా చూశారు. "మామగారు పోయినప్పుడు నవ్య కన్నీరు మున్నీరుగా ఏడ్చి ఏడ్చి స్పృహ కూడా తప్పిపడిపోయింది! ఇప్పుడు నవ్యకు ఏమైంది?!" అని అందరూ అనుకుంటూ ఆశ్చర్యంగా చూస్తున్నారు.

'నవ్య కంట్లో తడి కూడా లేదు! విషాదాన్ని నటిస్తోంది!' అని అందరూ ఏవేవో చెప్పుకుంటున్నారు!

నాకేమైంది?! - నవ్య నన్ను అడుగుతోంది! తన్ను తాను ప్రశ్నించుకుంటోంది! అందర్నీ అడుగుతోంది!

జవాబు ఆమె కళ్ళముందే వుంది!!

వస్తు వ్యామోహ జీవితం సమాజానికే కాకుండా, వ్యక్తికి కూడా పలు విధాలుగా - మానసికంగా కూడా ఎంతో హానికరమైందని నవ్య గుర్తించింది. వస్తు వ్యామోహం పెరుగుతున్నకొద్దీ మనిషిలో మానవప్రేమ తగ్గిపోతుందని కూడా నవ్య గుర్తించింది.

★ ★ ★

వస్తువ్యామోహ జీవనం 'జీవనకళ' ఎలా అవుతుంది!? శ్రమ జీవనం - సత్యజీవనం - సర్వసమాన సహజీవనం - మాత్రమే 'జీవనకళ' అవుతుంది!!

★ ★ ★

(సుప్రభాతం - వారపత్రిక - 17.03.2001)